## అభ్యర్థులు డీఈవోకు రిపోర్టు చేయాలి

మెదక్ మున్సిపాలిటీ, అక్టోబర్ 10: డీఎస్సీ-2024 నియామకాల్లో భాగంగా నియామకం పొందిన అన్ని కేటగిరీలకు చెందిన జిల్లా అభ్యర్థులు 11న కలెక్టరేట్‌లోని డీఈవో కార్యాలయంలో రిపోర్టు చేయాలని డీఈవో రాధాకిషన్ గురువారం ప్రకటనలో తెలిపారు. అపాయింట్‌మెంట్ ఆర్డర్ తీసుకుని రావాలని తెలిపారు.

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ



మనోహరాబాద్, అక్టోబర్ 10: మనోహరాబాద్ మండలం కూచారం గ్రామానికి చెందిన భాషమ్మకు మంజూరైన రూ. 29 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును మెదక్ మాజీ జడ్పీ చైర్ పర్సన్ ర్యాకల హేమలతాశేఖర్‌గౌడ్ గురువారం అందజేశారు.

## ఏఎస్సై ఆత్మహత్యాయత్నంపై డీఎస్పీ విచారణ

చిలిపిచెడ్, అక్టోబర్10: ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన ఏఎస్సై సుధారాణికి ఎలాంటి ప్రమాదం జరగలేదని, ఆమె ఆరోగ్యంగానే ఉన్నారని తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి తెలిపారు. చిలిపిచెడ్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఏఎస్సై సుధారాణి ఉరేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కాగా సిబ్బంది ఆమెను వెంటనే గమనించి దవాఖానకు తరలించారు. ఈ మేరకు తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, నర్సాపూర్ సీఐ జాన్‌రెడ్డి గురువారం చిలిపిచెడ్ పోలీస్ స్టేషన్లో విచారణ చేపట్టారు. విచారణ పూర్తి చేసి సమగ్ర సమాచారాన్ని ఉన్నతాధికారులకు అందజేస్తామని డీఎస్పీ తెలిపారు.

## క్రీడలతో మానసికోల్లాసం

చిన్నశంకరంపేట, అక్టోబర్10: మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్రం తెలిపారు. గురువారం కొర్విపల్లిలో క్రికెట్, కబడ్డీ, వాలీబాల్ టోర్నీని ప్రారంభించారు.

## నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

వెల్దుర్తి, అక్టోబర్ 10: వెల్దుర్తి, మాసాయిపేట మండలాల్లోని కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి శుక్రవారం చెక్కులు పంపిణీ చేయనున్నట్లు బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. వెల్దుర్తి ఎంపీడీవో కార్యాలయంలో చెక్కులు అందజేస్తారని, రెండు మండలాల్లోని లబ్ధిదారులు వచ్చి చెక్కులు తీసుకోవాలని పేర్కొన్నారు.

## రతన్ టాటాకు నివాళి

చిన్నశంకరంపేట, అక్టోబర్10: చిన్నశంకరంపేటలో రతన్‌టాటా చిత్రపటానికి మాజీ సర్పంచ్‌లు శ్రీమంత్‌రెడ్డి, రాజిరెడ్డి గురువారం ఘనంగా నివాళులర్పించారు.

## ఫిట్స్‌తో వ్యక్తి మృతి

మనోహరాబాద్, అక్టోబర్ 10 : ఫిట్స్‌తో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా పాపన్నపేట మండలం కుర్తివాడకు చెందిన బి. రవి (40) మెదక్ చర్చిలో కూలి పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. మనోహరాబాద్ మండలం కాళ్లకల్ గ్రామ శివారులో బుధవారం రాత్రి జాతీయరహదారి పక్కన ఫిట్స్ రావడంతో కిందపడిపోయాడు. విషయం తెలుసుకున్న బంధువులు, పోలీసులు ఘటనస్థలానికి చేరుకోగా అప్పటికే మృతి చెందాడు. మృతుడి భార్య రవిని మూడు సంవత్సరాల క్రితం విడిచిపెట్టి వెళ్లగా, తన ముగ్గురు పిల్లలను హాస్టల్‌లో వేసి చదివిస్తున్నట్లు బంధువులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

శివ్వంపేట, అక్టోబర్ 10 : రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందిన ఘటన శివ్వంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై మహిపాల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చిన్నగొట్టిముక్ల గ్రామానికి చెందిన వడ్డె సుధాకర్(21) గురువారం రాత్రి చిన్నగొట్టిముక్ల బస్టాండ్ నుంచి కొత్తకాలనీకి నడుచుకుంటూ వెళ్తుండగా వెనక నుంచి వచ్చిన బైక్ సుధాకర్‌ను ఢీ కొట్టడంతో తలకు తీవ్ర గాయాలై మృతి చెందాడు. మృతుడి తండ్రి నాగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నటు ఎస్సై తెలిపారు.





బతుకమ్మతో సితార



మెదక్ మున్సిపాలిటీ: ఎస్పీ కార్యాలయంలో బతుకమ్మ వేడుకల్లో ఎస్పీ ఉదయ్‌కుమార్ దంపతులు, సిబ్బంది



చిన్నశంకరంపేటలో సద్దుల బతుకమ్మలను పేరుస్తున్న మహిళలు



రామాయంపేట మహంకాళి ఆలయం వద్ద..

# పూల వనమై..



చేగుంట: కర్నాల్‌పల్లిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు, చిన్నారులు



వెల్దుర్తి: ఉప్పలింగాపూర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



పెద్దశంకరంపేట: బతుకమ్మ ఆడుతున్న మహిళలు



రామాయంపేట: కోనాపూర్‌లో



నిజాంపేటలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

- ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు
- ఆడిపాడిన ఆడపడుచులు, చిన్నారులు
- బతుకమ్మలు, గౌరమ్మల పాటలతో హోరెత్తిన పల్లెలు, పట్టణాలు
- చెరువులు, కాల్వల్లో నిమజ్జనాలు
- చెరువుల వద్ద పటిష్ట భద్రతను చేపట్టిన అధికారులు

**పల్లె, పట్టణం పూల వనమైంది. సద్దుల బతుకమ్మ** సంబురాలు అంబరాన్నంటాయి. గునుగు, తంగేడి, బంతి, చేమంతులు, సీతమ్మ జడలతో బతుకమ్మలను అందంగా పేర్చుతూ, బతుకమ్మలను చూస్తూ మురుస్తూ.. ఆడపడుచుల ఆటపాటలు, చిన్నారుల కేరింతలు, ముచ్చటగొలిపే ముసలవ్వల బతుకమ్మ పాటలతో ఊరంతా మురిసింది. తీరొక్క పూలతో అందరూ కలిసి బతుకమ్మలు పేర్చి, గౌరమ్మలు చేసి, మంగళహారతులు పట్టి, నైవేద్యాలు సమర్పించి, ప్రధాన వీధుల వద్ద ఉంచి ఆడిపాడారు. డప్పుచప్పళ్ల నడుమ దేవాలయాల ఆవరణలో, ప్రధాన కూడళ్ల వద్ద బతుకమ్మలు పెట్టి బతుకమ్మ, జానపద పాటలు పాడుతూ, ఆటలు ఆడుతూ సందడి చేశారు. అనంతరం బతుకమ్మలను తీసుకెళ్లి స్థానిక చెరువులు, కాల్వలు, కుంటల్లో నిమజ్జనం చేశారు. మహిళలు వాయినాలు, పసుపు, కుంకుమలు ఇచ్చిపుచ్చుకున్నారు. ఒకరికి ఒకరు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.

- న్యూస్‌నెట్‌వర్క్, మెదక్, అక్టోబర్ 10



తూప్రాన్: పోతరాజుపల్లిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



నర్సాపూర్‌లో బతుకమ్మ సంబురాల్లో మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్





అల్లాదుర్గం: వెంకట్రావుపేటలో బతుకమ్మ సంబురాలు



మనోహరాబాద్: కూచారంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



మెదక్ కౌన్సిలర్ వనజ



చిన్నశంకరంపేటలో..



శివ్వంపేటలో..



మెదక్ మున్సిపాలిటీ: కొదండ రామాలయంలో ..



కొల్చారం: వీకభద్ర ఆలయంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

## మహాలక్ష్మి అవతారంలో దుర్గాదేవి



రామాయంపేట: మహిషాసురమర్ధినిగా దర్శనమిచ్చిన మహంకాళి దేవి



చిన్నశంకరంపేటలో..



మెదక్‌రూరల్: మహిషాసురమర్ధినిగా, సరస్వతి దేవిగా..



పెద్దశంకరంపేట: తిరుమలాపురంలో దుర్గామాత పూజ

రామాయంపేట/చేగుంట/చిన్నశంకరంపేట/ పెద్దశంకరంపేట/ మెదక్ రూరల్/ అక్టోబర్ 10: జిల్లాలోని పలు మండలాల్లో దుర్గామాత ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. గురువారం గ్రామాల్లో దుర్గామాత మండపాల వద్ద భక్తులు మాలధారులు ప్రత్యేక పూజలుచేశారు. దుర్గాదేవి సన్నిధిలో కుంకుమ పూజ, అన్నదానం చేశారు. మహంకాళి అమ్మవారు మహిషాసురమర్ధినిగా భక్తులకు దర్శనమిచ్చారు. చేగుంట, నార్సింగి మండలాల్లో దుర్గమాత ఉత్సవాలను నిర్వహించారు.



రామాయంపేటలో దుర్గాదేవి పూజలో భక్తులు

## అర్హులందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు



సర్వాయికుంట బతుకమ్మ చెరువును పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

- చెరువులపై ప్రత్యేక నిఘా ఉంచాలి
- కలెక్టర్ రాహుల్‌రాజ్
- ఎల్‌ఆర్‌ఎస్ మొబైల్ యాప్ పరిశీలన

రామాయంపేట, అక్టోబర్ 10: రామాయంపేటలో పెండింగ్‌లో ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను అర్హులైన వారికి త్వరలోనే అందజేస్తామని కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. గురువారం రామాయంపేటకు విచ్చేసిన కలెక్టర్ ముందుగా ఎల్‌ఆర్‌ఎస్ మొబైల్ యాప్‌ను పరిశీలించి, వాటి విషయమై ఆపరేటర్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచి బతుకమ్మలు నిమజ్జనం చేసే సర్వాయికుంటతో పాటు డబుల్‌బెడ్ రూమ్ ఇండ్లను సందర్శించారు. నిర్వాసితులను వివరాలడిగి తెలుసుకున్నారు. ఖాళీగా ఉన్న 54 ఇండ్లను త్వరలోనే అర్హులకు అందజేస్తామని తెలిపారు. బతుకమ్మల చెరువుల వద్ద ప్రత్యేక నిఘా ఉంచాలని తహసీల్దార్ రజినీ కుమారికి తెలిపారు. ఆయన వెంట ఇరిగేషన్ ఈఈ సూర్యకాంత్, పీఆర్‌వో దేవరాజు, మేనేజర్ శ్రీనివాస్, ఆర్‌ఐ.రాజు ఉన్నారు.

## కాళిమాతకు ప్రత్యేక పూజలు

- అమ్మవారిని దర్శించుకున్న సినీనటుడు సుమన్





కాళిమాత విగ్రహానికి అభిషేకం చేస్తున్న సినీనటుడు సుమన్

వెల్దుర్తి, అక్టోబర్ 10: శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మండలంలోని మన్నెవారి జలాల్‌పూర్ గ్రామ శివారులో కొలువైన కాళిమాత ఆలయం వద్ద గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయకమిటీ ఆధ్వర్యంలో పలువురు దాతల సహకారంతో విశేషాలంకరణ, విశ్వశాంతి హోమం (ఎండు మిరపకారయలతో మహా యజ్ఞం) నిర్వహించారు. ఈ ఉత్సవాలకు సినీ నటుడు సుమన్, పీసీసీ కార్యదర్శి రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసినిరెడ్డి హాజరయ్యా రు. మహాదేవి ఉపాసకుడు సద్గురు శంకర విశ్వేశ్వర నందస్వామి ఆధ్వర్యంలో హోమంచేశారు.

## అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

మనోహరాబాద్, అక్టోబర్ 10: ఆర్థిక ఇబ్బందులు తాళలేక మరోవైపు కుమారుడి దవాఖాన ఖర్చుల కోసం చేసిన అప్పుల బాధతో జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేశాడు. అతడు చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందిన ఘటన మనోహరాబాద్‌లో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మనోహరాబాద్ గ్రామానికి చెందిన అబ్దుల్ జమీల్ (33) తన భార్య, కుమారుడితో మేడ్చల్ జిల్లా కీసరకు ఉపాధి నిమిత్తం వలస వెళ్లి ఓ ప్రైవేటు కంపెనీలో కూలీపని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. కాగా ఈ నెల 4 న మనోహరాబాద్‌కు తిరిగి వచ్చాడు. ఇదిలా ఉండగా అబ్దుల్ జమీల్ (33) కుమారుడి ఆరోగ్యం బాగలేకపోవడంతో ఓ ప్రైవేటు దవాఖానలో చికిత్స చేయించి అప్పుల పాలయ్యాడు. ఎంత పని చేసినా ఆర్థికంగా ఎదగకపోవడంతో పాటు అప్పులు కావడంతో జీవితంపై విరక్తి చెంది ఈ నెల 7 న గుర్తు తెలియని పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు అతడిని చికిత్స నిమిత్తం దవాఖానకు తరలించారు. కాగా బుధవారం రాత్రి పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ తెలిపారు.

## గాయపడిన కోతికి బాటసారి సపర్యలు



కొల్చారం, అక్టోబర్ 10: గీసులాటలో ఓ కోతి చేయి విరిగి నిస్సహాయ స్థితిలో పడి ఉంది. ఇది గమనించిన బాటసారులు దానికి సపర్యలు చేసిన ఘటన గురువారం రాంపూర్‌లో జరిగింది. మండలంలోని రాంపూర్, కిష్టాపూర్ గ్రామాల మధ్య జాతీయ రహదారిపై ఓ కల్వర్టు వద్ద కోతులు కొట్లాడుకున్నాయి. అన్ని కోతులు కలిపి ఒక కోతిపై దాడి చేయడంతో ఒంటి నిండా గాయాలయ్యాయి. చేయి విరిగి నిస్సహాయ స్థితిలో రోడ్డుపై పడి ఉంది. అటువైపు వెళ్తున్న వాహనదారులు ఆగి దాడి చేస్తున్న మిగితా కోతులను అక్కడి నుంచి తరిమివేశారు. చేయి విరిగి గాయాలతో అపస్మారక స్థితిలో పడి ఉన్న కోతికి నీరు తాగించారు. కొద్ది సేపటికి కళ్లు తెరిచిన కోతి మెల్లగా లేచి అక్కడి నుంచి వెళ్లిపోయింది.

## మూతపడిన పరిశ్రమలో చోరీకి యత్నం

మనోహరాబాద్, అక్టోబర్ 10: మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ముప్పిరెడ్డిపల్లి పారిశ్రామిక వాడలో మూతపడి ఉన్న బీఎస్ పరిశ్రమలో గుర్తు తెలియని దొంగలు చోరీకి యత్నించినట్లు ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. బీఎస్ పరిశ్రమలో గుర్తు తెలియని దొంగలు బుధవారం అర్ధరాత్రి క్రేన్, టిప్పర్ సహాయంతో పాడుబడ్డ మిషనరీ వస్తువులను చోరీ చేసి తీసుకెళ్తుండగా పోలీసులు వారిని గమనించి, వెంబడించారు. దీంతో దొంగలు వాహనాలను వదిలిపెట్టి పారిపోయారు. ఈ విషయాన్ని పరిశ్రమకు సంబంధించిన ఎస్‌బీఐ అధికారులకు సమాచారం ఇచ్చా రు. పరిశ్రమ నుంచి సుమారు 20 టన్నుల ఇనుము, మిషనరీ వస్తువులు చోరీకి గురైన ట్లు ఎస్‌బీఐ సిబ్బంది రవీందర్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని, త్వరలోనే దొంగతనం చేసిన వ్యక్తులను పట్టుకుంటామని ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ పేర్కొన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

## చేపలు పట్టేందుకు వెళ్లి మత్స్యకారుడు మృతి



డాకి యాదగిరి (ఫైల్)

రామాయంపేట, అక్టోబర్ 10: చేపలు పట్టేందుకు వెళ్లి మత్స్యకారుడు మృతిచెందిన ఘటన జరిగింది. రామాయంపేట పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని బీసీ కాలనీలో నివాసిస్తున్న మత్స్యకారుడు డాకి యాదగిరి (50) మంగళవారం ఇంట్లో నుంచి వలలు తీసుకుని చెరువులోకి చేపలు పట్టడానికి వెళ్లాడు. ఎంతకీ ఇంటికి రాకపోవడంతో స్థానిక చెరువులన్నీ వెతికారు ఎక్కడా మృతుడి ఆనవాళ్లు కనిపించలేదు. మృతుడు తీసుకెళ్లిన వలలు కొత్త చెరువు శివారులో కనిపించాయి. మృతదేహం కనిపించలేదు. దీంతో గజ ఈతగాళ్లతో గురువారం గాలించగా మృతదేహం బయటపడింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పంచనామా చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బాలరాజు తెలిపారు.

## విద్యుదాఘాతంలో వ్యక్తి మృతి

చేగుంట, అక్టోబర్10: విద్యుదాఘాతంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల కేంద్రమైన చేగుంటలో గురువారం చోటు చేసుకున్నది. చేగుంట పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా రాయపోలు గ్రామానికి చెందిన గడ్డమీద అనిల్(21)కు చేగుంటలోని మక్కరాజిపేట రోడ్డులోని తన సొంత స్క్రాప్ దుకాణం ఉన్నది. ఈ దుకాణం నుంచి ఇనుప నిచ్చెనను అనిల్, తన స్నేహితుడు సమీర్ కలిసి బయటకు తీస్తుండగా, పైన ఉన్న విద్యుత్ తీగలకు నిచ్చెన తగలింది. దీంతో ఇద్ద రు విద్యుత్ షాక్‌కు గురయ్యారు. వెంట నే స్థానికులు గమనించి అనిల్‌ను నార్సింగిలోని ఓ ప్రైవేటు దవాఖాన కు తరలించారు. అప్పటికే అనిల్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. అనిల్ స్నేహితుడు సమీర్‌ను చికిత్స నిమిత్తం దవాఖానకు తరలించారు. అనిల్ మృతదేహాన్ని పోస్టు మా ర్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యా దు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## పండుగ పూట నీటి కష్టాలు



పాపన్నపేట, అక్టోబర్ 10: బతుకమ్మ పండుగ రోజు నీటి కోసం మహిళలు ఇబ్బందులు పడ్డారు. పాపన్నపేటలోని నీళ్ల గౌని వద్ద సింగిల్ ఫేజ్ మోటర్ చెడిపోయి మూడు రోజులు కావస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. మోటర్‌ను బయటకు తీసి వదిలేశారు.